చిన్నకథ

# శ్రీమతి డైరీ

**- అభిమన్యు**



సీతాపతి ఆఫీస్ నుంచి ఇంటికి వచ్చేసరికి రాత్రి ఏడైంది. ఇంటికి తాళం వేసి ఉంది. తన భార్య సీత, పిల్లలు తనకు చెప్పకుండా ఎక్కడికి వెళ్ళి ఉంటారబ్బా...! అని ఆలోచిస్తుండగా పక్కింటి పరాంకుశం భార్య వచ్చి తాళాలు చేతిలో పెట్టి, మారు మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

తాళం తీసి లోనికి వెళ్లి లైట్లు వేసాడు. గదులన్నీ తిరిగాడు. ఇల్లంతా బోసి పోయినట్లనిపించింది. సీత ఉన్నట్లయితే ఈ పాటికి మాంచి కాఫీ ఇచ్చును. కాఫీ తాగాలని ఉంది సీతాపతికి కాని, చేసుకొనే ఓపిక లేక ఎప్పటిలాగే డ్రస్ మార్చుకోకుండా బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి, టీ.వి. ఆన్‌చేసి బెడ్ ఎక్కి కూర్చున్నాడు.

సీతాపతి, సీతకి పది సంవత్సరాల క్రితమే పెళ్లి జరిగింది. వారికి ఐదేళ్ల బాబు రవీంద్ర... మూడేళ్ళ పాప సింధూర. పిల్లలు పుట్టాక, ఒకరంటే ఒక రికి మోజు తగ్గాక చిన్నచిన్న లోపాలను భూతద్దంలో చూసుకుంటున్నారు...

గడియారం వైపు చూసాడు సీతాపతి. ఎనిమిది అయ్యింది. క్రమం తప్పకుండా చూసే టీ.వి సీరియల్స్ మీద మనసు లేదు. తల నెప్పిగా ఉంది. సీత, పిల్లలు ఎక్కడికి వెళ్ళారో తెలియడం లేదు. తనకు తెలియకుండా, చెప్పకుండా సీత ఎక్కడికీ వెళ్ళదు. కాఫీ తాగాలని ఉంది. టీ.వీ. కట్టేసి, వంట గదికి వెళ్ళాడు సీతాపతి.

స్టవ్‌మీద పాలగిన్నె పెట్టి కాఫీ పొడరు కోసం వెతుకుతున్న సీతాపతికి పప్పులు, పోపుల డబ్బాల వెనుక డైరీ కని పించింది. అదితీసి చూసి ఆశ్చర్యపోయాడు సీతాపతి. కాఫీ విషయం మరిచి పోయి ఆ డైరీని చదవడం ప్రారంభించారు.

అది శ్రద్ధగా ప్రతి దినం రాసుకునే డైరీ కాదు. అది కేవలం సీత ఫీలింగ్స్. చదవడం మొదలు పెట్టాడు సీతాపతి.

''దేవుడు నిజంగా మగ పక్షపాతియే.... స్త్రీని అందంగా సృష్టించాడు. సంసారం అనే పంజరంలో బంధించాడు.''

''స్త్రీ కైనా పురుషుడికైనా జీవితంలో తోడు అవసరం. అందుకే పెళ్లి. నిజానికి ఈ పెళ్లి నాకిష్టం లేదు. తల్లిదండ్రుల మాటను తీసేయ లేక...''

''అయిష్టాన్ని ఇష్టంగా మార్చుకొని... నా ఫీలింగ్స్‌ని నాలోనే దాచేసుకొని కాపురానికి వచ్చాను...''

''పిల్లలు పుట్టనంతవరకూ నా కాపురం సజావుగా, ఆనందంగా సాగింది. ఎంత ఆనందం అంటే... 'మా ఆయన బంగారం' అనే ఫీలింగ్ కలిగింది. బహుశా! చాలామంది అమ్మాయిలకి పెళ్లైన కొత్తలో ఇలాంటి ఫీలింగ్స్ ఉంటాయనుకుంటాను. హేట్సాఫ్ టు హజ్‌బెండ్...''

''భరించే వాడు భర్త అంటారు... అది పొరపాటు. ఆఫీస్‌లో బాస్ తిట్టినా, స్నేహితులతో గొడవ పెట్టుకున్నా, ఎవ్వడితోనన్నా తన్నులు తిన్నా సరాసరి ఇంటికివచ్చి పెళ్ళాం మీద చూపిస్తారు పౌరుషం...''

''మా ఆయన పేరులోనే నేను సగం. అంతేగానీ ఏనాడు నా పనులకి సాయం రాలేదు.''

''నాపతి ఆఫీసు నుంచి వచ్చిన వెంటనే టీవీకి అతుక్కుపోతారు. పిల్లలు ఏం చదువుతున్నారు..? ఎలా చదువుతున్నారు...? లాంటివి ఆయనకి పట్టవు. రాత్రి పది వరకు టీవీ చూస్తారు. అన్ని సీరియల్స్ ఫాలో అవుతారు. పడుకునే ముందు కోరిక కలిగితే అప్పుడు పెళ్లాం గుర్తుకు వస్తోంది...''

''ఇంట్లో ఎప్పుడూ సీరియస్‌గానే ఉంటారు. భార్యతో పది నిమిషాలు సరదాగా మాట్లాడటానికి కూడా టైం లేనంత బిజీ మనిషి. స్నేహితులతో ఎన్ని గంటలైనా సరదాగా జోకులేస్తూ, నవ్విస్తూ, నవ్వుతూ ఉంటారు''

''నిజానికి నాకు సరిగ్గా వంట చేయడం రాదు. అయినా బాగా చేయడానికి ప్రయత్నిస్తుంటాను. తరచూ వంట బాగాలేదని కోపంతో చిందులు వేస్తారు. బాగున్న రోజున మాత్రం 'బాగుంది' అనరు.''

''నీకీ చీర బాగుంది... నువ్వు చాలా అందంగా ఉంటావ్... నువ్వంటే ఇష్టం..'' లాంటి మాటలు పెళ్లైన మొదట్లో విన్నాను. ఇప్పుడు తరచూ ఆయన నోటి నుండి వచ్చే పదం 'నువ్వొక వేస్టాఫ్ ఇండియా''

''నా పుట్టింటి తరపువాళ్ళు గాని, నా స్నేహితులు గాని ఎవరైనా వస్తే మూతి ముడుచుకొని కూర్చుంటారు. అదే తన వాళ్ళెవరైనా వస్తే నేను మాత్రం పళ్ళికిలిస్తూ మాట్లాడాలి...''

''నన్నుగాని, పిల్లల్నిగాని సరదాగా సినిమాలకి గాని, షికార్లకి గాని తీసుకువెళ్ళారు. ఆయన మాత్రం కొత్తగా రిలీజైన సినిమాలన్నీ చూసేస్తారు. మొత్తానికి భార్య అంటే ఆయన దృష్టిలో జీతం, భత్యం లేని కాదు... కాదు అడగని సేవకురాలు...''

''ఇరవైఏళ్లు అమ్మా నాన్న దగ్గర పెరిగి ఒకే ఒక్క రోజులో ఇంకో ఇంటికి కాపురానికి వెళ్ళాల్సి వస్తుంది. పుట్టింట్లో ఉన్నప్పుడు అమ్మ బెడ్‌రూమ్‌కి కాఫీ తెచ్చిచ్చేది. ఆకలిగా లేదంటే అమ్మ బతిమిలాడి గోరు ముద్దలు తినిపించేది. ఇప్పుడు అందరూ తిన్నాక ఆఖర్న తను తినాలి ఏమైనా మిగిలితే. భార్య ఒక్క రోజులో మారినంత, భర్త మారలేడా..? పుట్టింట్లో అల్లారు ముద్దుగా పెరిగిన భార్యను మెట్టినింట్లో సంతోషంగా ఉంచడానికి భర్త ప్రయత్నించక్కర లేదా...!?''

ఆ డైరీ చదివాక సీతాపతి మనస్సంతా ఏదోలా అయిపోయింది. తన జీవిత భాగస్వామి పట్ల ప్రవర్తించిన తీరుకు సిగ్గుపడుతున్నాడు. డైరీని యథాస్థానంలో ఉంచాడు. ఈలోగా తలుపు చప్పుడైంది.

సీతాపతి తలుపు తీసాడు. సీత, పిల్లలు, పిల్లల చేతుల్లో బెలూన్లు, బొమ్మలు. సీత ముఖంలో భయం.

''మీ సెల్‌కి నాలుగుసార్లు చేసాను. ఎంగేజ్ వచ్చింది. ఎగ్జిబిషన్ ఈ రోజుతో ఆఖరు. పిల్లలు గొడవ పెడ్తుంటే...'' అని సీత సీతాపతి వైపు చూసింది.

సీతాపతి ముఖంలో ఎటువంటి ఫీలింగ్స్ లేవు. ''నాకు తల నెప్పిగా ఉంది కాఫీ కావాలి...'' అని అడిగాడు.

''రెండు నిమిషాల్లో తెస్తాను. మీరెళ్లి టీవీ చూస్తుండండి..'' అని వంట గదిలోకి నడిచింది సీత.

''నేను టీ.వి చూడను..'' అన్నాడు సీతాపతి. సీత, పిల్లలు ఆశ్చర్యంగా చూసారు సీతాపతి వైపు.

''అదేం పాపం... సీరియల్స్ మిస్సయితే మీకు నిద్ర పట్టదు...'' వ్యంగ్యంగా అంది సీత.

''ఇప్పటికే చాలా మిస్సయ్యాను..'' అని వంట గదిలోకి వెళ్ళి సీత నడుం మీద చేతులేసి చిన్నగా నొక్కాడు.

''ఏంటి విషయం...!?''

''ఈ చీరలో నువ్వు చాలా అందంగా ఉన్నావు...''

''ఈ డైలాగ్ పెళ్ళైన మొదటి రోజుల్లో విన్నట్టు గుర్తు... నా డైరీ చదివారా....'' కళ్ళను గుండ్రంగా తిప్పుతూ అంది.

''అవును సీతా! 'మగాడు' అన్న అహంతో నీ పట్ల దురుసుగా ప్రవర్తించాను. నీ ఫీలింగ్స్ చదివి 'భార్య', అంటే 'బానిస' అనే భావం నుండి బయటికి వచ్చాను. నిజానికి స్త్రీ లేనిదే పురుషుడు లేడు. స్త్రీ సహాయ సహకారాలు లేకుంటే పురుషుడు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేడు. ఇది నిజం...'' అని సీతాపతి సీత గుండెల్లో తలదాచుకున్నాడు.

స్టవ్ మీద కాఫీ పొంగింది. పిల్లలు మమ్మీ, డాడీ అంటూ వచ్చారు.

*